క్లుప్తంగా

పశువులను గోశాలకు తరలిస్తాం

సాక్షి ఎఫెక్ట్..

ఉట్నూర్‌రూరల్: రోడ్లపై పశువులను వదిలితే బంజారు దొడ్డిలో వేసి గోశాలకు తరలిస్తామని ఉట్నూర్ గ్రామపంచాయతీ ఈవో శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5న సాక్షిలో ప్రచురితమైన 'రోడ్లపైనే మూగ జీవాలు' వార్తకు ఆయన స్పందించారు. రోడ్లపై పశువులను వదలయడంతో పాఠశాల, కళాశాల విద్యార్థులు, ఉద్యోగస్తులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. యజమానులు పశువులను రోడ్లపై వదలకూడదని గ్రామపంచాయితీ సిబ్బందిరిక ఎలాంటి ఆటంకాలు కలిగించిన పోలీసు కేసు నమోదు చేస్తామన్నారు.

వాటర్ బాటిళ్లు పంపిణీ

తాంసి: యాద శంకర ట్రస్ట్ పేరిట సంగిశెట్టి బాబు ప్రతీ ఏటా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు లక్షల విలువైన సామగ్రి అందజేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో స్టీల్ వాటర్ బాటిళ్లు, బ్యాగులు, డిక్షనరీలు అందజేశారు. పొన్నారి, హస్నాపూర్, వడ్డాడి, కప్పర్ల, బండల్‌నాగాపూర్, సావర్గాం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శిల్ప, ఆనంద్, కిష్టన్న, ట్రస్ట్ సభ్యులు జీవన్ కుమార్, సమీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జోగు రామన్నను కలిసిన తాటిగూడ వాసులు

ఎదులాపురం: పట్టణంలోని తాటిగూడ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను తీర్చాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. బుధవారం మాజీ మంత్రి జోగు రామన్నను ఆయన నివాసంలో కలిసి సమస్యను విన్నవించారు. దీంతో జోగురామన్న మున్సిపల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మాజీ ఎమ్మెల్యేను కలిసిన వారిలో వార్డు అధ్యక్షుడు సలీమ్, కాలనీవాసులు ఫర్వీన్, ఫెరోజ్ పాల్గొన్నారు.

గుంతను పూడ్చిన పోలీసులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలంలోని దంతన్‌పల్లి సమీపంలోని వంతెన వద్ద ఏర్పడిన గుంతలను ఉట్నూర్ ఎస్సై మనోహర్ పూడ్చివేయించారు. మాజీ సర్పంచ్ భూమన్నతో కలిసి ట్రాక్టర్‌ల ద్వారా మొరం వేయించారు. ఇటీవల పలు ప్రమాదాలు సంభవించగా దృష్టి సారించిన పోలీసులు చర్యలు చేపట్టారు. దీంతో వాహనదారులు, గ్రామస్తులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం: భవిత కేంద్రాల్లో ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆదిలాబాద్ ఎంఈవో సోమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ పట్టణం, గ్రామీణం, మావల మండలానికి సంబంధించి మొత్తం మూడు భవిత కేంద్రాల్లో ఆయా పోస్టుల ఖాళీగా ఉన్నాయన్నారు. మహిళలు మాత్రమే అర్హులని, పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలని, వికలాంగ విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. నెలకు రూ.3250 గౌరవ వేతనం ఉంటుందని, ఆసక్తి గల వారు ఆదిలాబాద్ ఎంఈవో కార్యాలయంలో ఈనెల 9తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

కైలాస్‌నగర్: కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం పోరెడ్డి కిషన్ ఆధ్వర్యంలో చాందా(టి) నుంచి యెల్టీ భోజారెడ్డి, సుధాకర్ గౌడ్ ఆధ్వర్యంలో తంతోలి గ్రామ ఉప సర్పంచ్ భీమనవేణి జగదీష్‌తో పాటు పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలోని ప్రజా సేవ భవన్‌లో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషి

ఇచ్చోడ: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషి చేయనున్నట్లు ఎంఈవో రాథోడ్ ఉదయ్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూం టూ రీడ్ పుస్తకాల పంపిణీ చేశారు. 1, 2వ తరగతి విద్యార్థులకు వికాసం-1, వికాసం-2 పుస్తకాలు ఎంతో దోహదపడుతాయన్నారు. పుస్తకాలు పఠన స్థాయిని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హేమన్‌రావు, విజయ్, ఉదయశ్రీ,, సీఆర్పీ శ్యాంసుందర్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ జగదీశ్, మనోహర్ పాల్గొన్నారు.

కథా రచనపై వర్క్‌షాప్

జైనథ్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పత్తిపాక ఫౌండేషన్, గరిపాక ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కథా రచనపై ఒక్క రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. బుధవారం కూర జెడ్పీ ఉన్నత పాఠశాల, లక్ష్మీపూర్ పాఠశాలలకు చెందిన 50మంది విద్యార్థుల్లో హాజరయ్యారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, సృజనాత్మకతను వెలికితీసేందుకు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పోరెడ్డి అశోక్, ఉపాధ్యాయులు మమత, విలాస్, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల్లో 'పెద్దగూడ'



వాగు దాటుతున్న ఆదివాసీ మహిళ

- అభివృద్ధికి దూరంగా గ్రామం
- కనీసం సౌకర్యాలు కరువు
- వర్షాకాలంలో బాహ్య ప్రపంచానికి దూరం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

బోథ్: మండలంలోని పెద్దగూడ గ్రామం సమస్యలతో కొట్టిమిట్టాడుతోంది. పెద్దగూడ గ్రామం చింతలబోరి గ్రామ పంచాయతీ పరిధిలో ఉంది. గ్రామానికి ఒకవైపు వాగు, మరోవైపు గుట్ట ఉంది. పేరుకే పెద్దగూడ.. అభివృద్ధిలో మాత్రం చిన్నబోయింది. గ్రామంలో ఒక సీసీరోడ్డు మినహా ఎలాంటి అభివృద్ధి లేదు. మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. గ్రామంలో 20 కుటుంబాలు, 106 మంది ఓటర్లు, 130 జనాభా ఉంది. రేషన్ సరుకుల కోసం 8 కిలో మీటర్ల దూరంలోని సొనాల గ్రామానికి వెళ్లి సరుకులను తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఉచిత బియ్యానికి, సొనాలకు రాను పోనూ రూ . 50 ఖర్చు చేయాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వంతెన లేక ఇబ్బందులు..

వాగుపై వంతెన లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామం నుంచి ఇతర గ్రామాలకు వెళ్లాలంటే వాగు దాటాల్సిన పరిస్థితి. విద్యార్థులు చింతలబోరి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లాలంటే వాగు దాటాలి. ప్రతీరోజు పిల్లలను తల్లిదండ్రులు వాగు దాటిస్తున్నారు. వర్షం పడి వాగు ఉధృతంగా ప్రవహిస్తే వాగు దాటడం కష్టం. ఇక వివిధ పనుల కోసం బోథ్, సొనాల, చింతలబోరి గ్రామాలకు వెళ్లేవారికి ఇబ్బందులు తప్పడం లేదు.

వంతెన నిర్మించాలి



మా గ్రామానికి ఆనుకుని ఉన్న వాగుపై వంతెన లేకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. విద్యార్థులు పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి ఉంది. సరుకులు తీసుకురావడానికి ఇబ్బందులు పడుతున్నాం. వాన వస్తే చాలు వాగు ఉప్పొంగి ప్రవహించడంతో గ్రామంలోనే ఉంటున్నాం. అధికారులు స్పందించి వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలి.

– కోవ చత్రుగన్, పెద్దగూడ

డ్రెయినేజీలు లేవు



గ్రామంలో మురుగునీరు వెళ్లేందుకు డ్రెయినేజీలు లేవు. దీంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. మరోవైపు రెండో తరగతి వరకు బోధించుటకు పాఠశాల భవనాన్ని నిర్మించాలి. చిన్న గుడిసెలో ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. వర్షం కురిస్తే వర్షపు నీరు గుడిసెలోకి వచ్చి తడిగా మారుతోంది.

– కోవ జలపతి, పెద్దగూడ

ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గుడిసెనే పాఠశాల..



ఇక్కడ కనిపిస్తున్న గుడిసే.. పెద్దగూడ గ్రామంలోని పాఠశాల. అంగన్‌వాడీ కేంద్రం కూడా ఈ గుడిసెలోనే నిర్వహిస్తున్నారు. తొమ్మది మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. రెండో తరగతి వరకు ఉపాధ్యాయులు వినోద్ పాఠాలు బోధిస్తున్నారు. వర్షాకాలంలో ఊరుస్తుండటంతో నేల తడిచిపోయి, తడిగా మారుతోంది. దీంతో విద్యార్థులు కూర్చోలేని పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తే ఉపాధ్యాయుడు గ్రామానికి రాలేని పరిస్థితి నెలకొంటుంది.

వాగులో లీకవుతున్న 'భగీరథ' పైప్‌లైన్



గ్రామంలో బోరు బావులు, చేతి పంపులు లేవు. వారికి మిషన్ భగీరథ నీరే దిక్కు. మిషన్ భగీరథ పైపులైన్ వాగులో నుంచి వేశారు. వాగులో పైపు తేలియాడుతోంది. రెండు వైపులా నీరు లీక్ అవుతోంది. దీంతో మిషన్ భగీరథ నీరు కలుషితమౌతోంది. చింతలబోరి గ్రామానికి చెందిన ఓ నాయకుడు బోరు వేయించినా ప్రస్తుతం పని చేయడం లేదు.

పోస్టల్ పథకాలపై అవగాహన

బేల: తపాలా శాఖ పరిధిలో ప్రతీ పోస్టాఫీసులో జీరో అకౌంట్ తీయవచ్చని జిల్లా పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రాజు అన్నారు. బుధవారం శ్రీరామమందిరం కమ్యూనిటీ హాల్‌లో ఆపోస్టల్ ఇన్సూరెన్స్, ఆయా పథకాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీరో అకౌంట్, నెలసరి జమ, సుకన్య సమృద్ధి యోజన, తదితర పథకాల గురించి వివరించారు. భవన నిర్మాణ కార్మికులు, విద్యుత్ పనులు చేసేవారు, రైతులు, గంగపుత్రులు, కూలీ పనులు చేసే వారికి ఆయా ప్రమాద భీమా పథకాల కోసం రూ.520తో ప్రీమియం చెల్లింపు, ఏదైనా ప్రమాదం సంభవిస్తే లభించే రూ.1లక్ష వరకు వైద్య ఖర్చులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా పోస్టల్ పేమెంట్ బ్యాంక్ మేనేజర్ రాజేష్, ఎంవో ప్రవీణ్, పోస్ట్‌మాస్టర్‌లు రాజు, దిగాంబర్, మునేశ్వర్, కిషన్, ప్రణీత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రాజు

ఘనంగా చేనేత దినోత్సవం

బోథ్: మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో భక్త మార్కండేయ ఆలయంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చేనేత కార్మికులకు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని కోరారు. కార్మికులకు పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం సామాల సదాశివ మాస్టారు 13వ వర్ధంతి నిర్వహించారు. ఆయన రాసిన కవితలు, రచనలు ఎంతో మందికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు సామాల సదాశివ్, మెరుగు భోజన్న, అనిల్ కుమార్, వెంకటేశ్, వేముల చంద్రమోహన్, సత్యనారాయణ, కిరణ్, చంద్రమోహన్, కిష్టయ్య, శ్రీనివాస్, దాసు, ప్రసాద్, పోశెట్టి, స్వామి, మల్లేష్, జీవన్ పాల్గొన్నారు.



పాల్గొన్న పద్మశాలి నాయకులు

న్యాయవాద రక్షణ చట్టం తీసుకురావాలి

ఎదులాపురం: న్యాయవాద రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేశ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జనగామలో న్యాయవాదులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జనగామ పోలీసులు న్యాయవాదులు అమృత్‌రావు, కవితలపై దాడి చేయడం సరికాదన్నారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులే దాడికి దిగడం సబబుకాదన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చట్టాన్ని తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంతోష్, సభ్యులు ముజాహిద్, చందుసింగ్, శర్మ, శ్రీనివాస్‌రెడ్డి, నిఖిలేష్, గౌడ్, రవీందర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

నేరడిగొండ: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మండల ప్రత్యేకాధికారి రవీందర్ అన్నారు. స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కుంటాల గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో, అంగన్‌వాడీ కేంద్రంతో పాటు ఎంపీపీఎస్ పాఠశాల ఆవరణలో అధికారులు, సిబ్బందితో కలిసి పిచ్చిమొక్కలు తొలగించారు. గ్రామంలో పర్యటించి డ్రెయినేజీలను శుభ్రం చేయించారు. ఇంటి ఆవరణలో నిల్వ ఉన్న నీటిని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీవో లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి నిరోశ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు

బైక్‌ల వేలం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఎక్సైజ్ స్టేషన్ ఇచ్చోడ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు పట్టుబడిన బైక్‌లను వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు. బుధవారం ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చోడ ఎక్సైజ్ సీఐ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం వేయనునట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

సద్గురు జన్మదిన వేడుకలు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని టీచర్స్ కాలనీలో అడనేశ్వర్ ఆలయంలో గురువారం సద్గురు జన్మదినోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

బెటాలియన్‌లో వన మహోత్సవం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ శివారు ప్రాంతంలో గల 2వ పోలీస్ బెటాలియన్‌లో గురువారం వన మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో పాటు డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని బెటాలియన్ కమాండెంట్ తెలిపారు.

డిప్యూటీ సీఎంకు ఘన స్వాగతం



ఘన స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే పాయల శంకర్, నాయకులు

బజార్‌హత్నూర్: మండలంలోని పిప్రి గ్రామానికి పలు అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు బుధవారం విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ఘన స్వాగతం పలికారు. హెలిప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

'ఎమ్మెల్యే సాయం మరిచిపోలేం'

ఉట్నూర్‌రూరల్: విద్యుత్ ప్రమాదంలో తమ కొడుకు నాగచైతన్య కాళ్లు పూర్తిగా దెబ్బతినడంతో చిత్రాల చారిటేబుల్ ట్రస్ట్ సహకారంతో కృత్రిమ కాలు అమర్చినందుకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సాయం మరిచిపోలేమని బాధిత కుటుంబీకులు మొగిలి అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే రూ. 5 వేలు ఆర్థిక సాయం చేశారు. రానున్న రోజుల్లో కుటుంబానికి ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

ముందస్తు అరెస్టు సిగ్గుచేటు

ఎదులాపురం: ముందస్తు అరెస్టు చేయడం సిగ్గుచేటని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్, పట్టణ కార్యదర్శి కార్తీక్, కన్వీనర్ నిఖిల్, శివసాయి అన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్‌తో డిప్యూటీ సీఎం పర్యటనను అడ్డుకునేందుకు ఏబీవీపీ పిలుపునివ్వగా, బుధవారం ఉదయం నుంచే పోలీసులు ఏబీవీపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారని మండిపడ్డారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇచ్చోడ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిరణ్ అన్నారు. బుధవారం మండలంలోని ఇస్లాంనగర్, కోకస్‌మన్నూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పాల్గొని మాట్లాడారు. గత కొన్ని రోజులుగా ప్రతీ రోజు వర్షాలు కురుస్తున్నందున దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంది. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు రాథోడ్ కైలాస్, ఉత్తంసింగ్, సుభాష్ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తల్లిపాలే బిడ్డకు అమృతం

ఆదిలాబాద్‌టౌన్: తల్లిపాలే బిడ్డకు అమృతం అని ఖుర్షీద్‌నగర్ అర్బన్‌హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ సయ్యద్ అన్సార్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రం1లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఏటా ఆగస్టు మొదటి వారంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నవజాత శిశువుల అభివృద్ధి, తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. తల్లిపాల విశిష్టతను వివరిస్తూ వారోత్సవాలు నిర్వహించడం జరిగిందన్నారు. వెల్‌బేబి షో నిర్వహించి సంవత్సరం లోపు పిల్లల బరువు, ఎత్తుతో పాటు అన్నిరకాల టీకాలు వేయించిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. సూపర్‌వైజర్ ఫర్హా, ఏఎన్‌ఎం తులసీ, ఆర్పీ ఫరీద, అంగన్‌వాడీ టీచర్ రాధ పాల్గొన్నారు.

తాంసి: పుట్టిన బిడ్డకు తల్లిపాలే ఆరోగ్యమని ఐకేపీ వీవోఏ అధ్యక్షురాలు కవిత అన్నారు. మండలంలోని పొన్నారి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణులకు, మహిళలకు అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం తరపున సరఫరా చేస్తున్న పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు దేవమ్మ, గంగమ్మ, మహిళలు, గర్భిణులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న మెడికల్ ఆఫీసర్

'స్వచ్ఛదనం.. పచ్చదనం'లో పాల్గొనాలి



జైనథ్: మొక్క నాటుతున్న జెడ్పీ సీఈవో కలిందిని

బేల: స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో యువత పాల్గొనాలని జిల్లా పరిషత్ సీఈవో కలిందిని కోరారు. బుధవారం మండలంలోని చప్రాల, సిర్సన్న గ్రామాల్లోని స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. చప్రాల జెడ్పీహెచ్‌ఎస్‌లో, అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. ఆమె వెంట ఎంపీడీవో మహేందర్‌కుమార్, ఎంపీవో వినోద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు సురేశ్, అర్షద్ ఉన్నారు.

జైనథ్: సమస్త జీవకోటికి మనుగడకు కారణమైన ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని జెడ్పీ సీఈవో కలిందిని అన్నారు. బుధవారం సీఈవో ఇతర అధికారులతో కలిసి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట శ్రమదానం నిర్వహించారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు నాటిన మొక్కలను పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజనం వండుతున్న తీరు, నాణ్యతను పరిశీలించారు. అనంతరం పక్కనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అధికారులు, నాయకులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సాంబశివరావు, ఎంపీడీవో రవీంద్రనాథ్, తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీవో వెంకట్ రాజు పాల్గొన్నారు.

గ్రామాలను స్వచ్ఛగా మార్చాలి

తాంసి: గ్రామాలను స్వచ్ఛగా మార్చాలని మండల ప్రత్యేకాధికారి వెంకటరమణ అన్నారు. బుధవారం మండలంలోని పాలోది గ్రామంలో ఎంపీడీవో మోహన్ రెడ్డితో కలిసి పరిశుభ్రత పనులు పరిశీలించారు. గ్రామంలోని నిల్వ నీటి తొలగింపు, పిచ్చి మొక్కలతో పాటు పరిశుభ్రత పనులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, గ్రామస్తులు ఆశన్న, సతీష్, శంకర్ పాల్గొన్నారు.

మా గోస తీర్చండి సారూ..

- అడేగామ(కె) గ్రామంలో వెలిసిన ఫ్లెక్సీ

బజార్‌హత్నూర్: మండలంలోని పిప్రి గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన సభలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్న సమయంలో పిప్రి నుంచి ఇచ్చోడకు వెళ్లే మార్గంలోని అడేగామ(కె) గ్రామంలో మా గోస తీర్చండి సారూ అని రాసిన ఫ్లెక్సీని రైతులు ఏర్పాటు చేశారు. అడేగామ చెరువు నిర్మించి 15 సంవత్సరాలు అవుతున్నా.. కాలువల పనులు పూర్తి కాకపోవడంతో రబీ సాగుకు నీరు అందక రెండో పంటకు నీరు అందడం లేదన్నారు. అడేగామ(కె), అడేగామ(బి), కొకస్ మన్నూర్ రైతులు ఆవేదనతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ అధికారుల దృష్టిలో పడింది. ఇకనైనా సమస్య పరిష్కారం అవుతుందో లేదో చూడాలి.



అడేగామలో రైతులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఆదివాసీ దినోత్సవానికి కదలిరండి

ఉట్నూర్‌రూరల్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి అధిక సంఖ్యలో గిరిజనులు తరలిరావాలని మాజీ ఎంపీపీ జైవంత్‌రావు, జిల్లా మేడి మెస్రం దుర్గు పటేల్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రెస్ భవన్‌లో మాట్లాడారు. శుక్రవారం ఉదయం 8గంటలకు వరకు ఆదివాసీగూడలో జెండాలు ఆవిష్కరించాలన్నారు.

తాంసి: జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో గార్డెన్‌లో ఈనెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు భారత్ కోరారు. బుధవారం మండలంలోని లీంగూడ, అట్నంగూడ గ్రామాల్లో కరపత్రాలు ఆవిష్కరించారు.

ఇచ్చోడ: ప్రతీ ఆదివాసీ గూడెంలో ఈనెల 9 ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని తుడుం బోథ్ డివిజన్ కార్యనిర్వహక అధ్యక్షుడు ఆత్రం మహేందర్ అన్నారు. బుధవారం మండలంలోని రఘుగూడ, మాన్కుగూడ గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. ఉదయం తొమ్మిది గంటల లోపు ఆదివాసీ జెండా ఆవిష్కరించాలన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ హీరా సుక్క పర్ధాన్ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల హీరా సుక్కా ఆలయ ఆవరణలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు ఆ సమితి జిల్లా అధ్యక్షుడు సిడాం రాంకిషన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని హీరా సుక్క ఆలయ ఆవరణలో కరపత్రాలు ఆవిష్కరించారు.

ఎదులాపురం: ఆదివాసీ దినోత్సవ కరపత్రాలను మాజీ మంత్రి జోగురామన్న బుధవారం ఆదివాసీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈనెల 9న ఉట్నూర్‌లో కేబీ కాంప్లెక్స్‌లో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు, హాజరు కావాల్సిందిగా కోరారు.



తాంసి: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న గిరిజనులు